
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
మంగళవారం 6 ఆగస్టు 2024



ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

సీఎం సమావేశానికి కలెక్టర్‌కు దక్కని అవకాశం

పాడేరు ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన కలెక్టర్ల సమావేశానికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌కు అనుమతి లభించలేదు. సీఎం నిర్వహించే ... మిగతా 8వ పేజీలో

రక్షణ లేని ఘాట్ ప్రయాణం

శిథిలావస్థకు చేరిన గోడలు

- హెయిర్ పిన్‌బెండ్‌ల వద్ద ప్రమాద ఘంటికలు
- వర్షాలకు కోతకు గురైన రోడ్డు
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు
- భయోందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు
- ఇదీ అరకులోయ ఘాట్ దుస్థితి



అనంతగిరి మండలం మర్దగుడ సమీపంలో మలుపు వద్ద కూలిన రక్షణ గోడ

అనంతగిరి, ఆగస్టు 5:

ఎత్తైన కొండలు.. పచ్చని చెట్లు.. ఆహ్లాదం కలిగించే ఘాట్‌రోడ్డు ప్రయాణం.. అది ఒకప్పటి మాట.. నేడు పరిస్థితి భిన్నంగా మారింది. ప్రస్తుతం ఘాట్‌రోడ్డు ప్రయాణమంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఎక్కడికక్కడ రక్షణ గోడలు శిథిలమై ప్రయాణానికి రక్షణ లేకుండా పోయింది. ఓహెచ్‌సీ కేబులు ఏర్పాటుకు రోడ్డును ఆనుకుని తవ్విన గోతుల కారణంగా రక్షణ గోడలు పూర్తిగా పడిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇరువైపులా రోడ్డు కోతకు గురైంది. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

మన్యం అందాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి పర్యాటకులు ఘాట్‌రోడ్డు మార్గంలోనే అరకులోయ చేరుకునేందుకు మొగ్గు చూపుతుంటారు. ఎస్.కోట నుంచి అరకు వరకు 60 కిలోమీటర్లు ఎత్తయిన కొండల నడుమ ఘాట్‌రోడ్డు ప్రయాణం సాగుతుంది. ఘాట్‌రోడ్డు అధ్వానంగా మారడంతో పర్యాటకులు భయోందోళన చెందుతున్నారు. గతంలో అరకు-విశాఖ ప్రధాన రహదారి ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉండేది. ప్రస్తుతం జాతీయ రహదారుల సంస్థకు పరిధిలోకి మారింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నప్పుడు ఈ రోడ్డు నిర్వహణను కాంట్రాక్టర్‌కు అప్పగించి ఆ శాఖ అధికారులు పర్యవేక్షణ చేసేవారు. ఆరేళ్ల క్రితం నేషనల్ హైవే సంస్థకు అప్పగించడంతో ఆర్‌అండ్‌బీ శాఖ పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు, రక్షణ గోడలు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి.

ప్రమాదభరితంగా హెయిర్ పిన్‌బెండ్ మలుపులు

అనంతగిరి మండలం చిలకలగెడ్డ నుంచి అరకులోయ వరకు ఎనిమిది హెయిర్ పిన్‌బెండ్ ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. మలుపుల వద్ద ఇటీవలే జరిగిన ప్రమాదాలకు రక్షణగోడలు పూర్తిగా పడిపోయాయి. పెద్ద వాహనాలు మలుపుల వద్ద భయం భయంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

శిథిలావస్థకు చేరిన రక్షణ గోడలు

లైడ-శివలింగపురం మధ్యలో గల హెయిర్ పిన్‌బెండ్ 1 సమీపంలోని అర కిలోమీటర్ మేర రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. డముకు-లైడ మధ్యలో గల 3, 4, 5 హెయిర్ పిన్‌బెండ్ సమీపంలోని రక్షణ గోడలు పూర్తిగా పడిపోయాయి. హెయిర్ పిన్‌బెండ్ 5 వద్ద ఐరెన్‌వాల్ పూర్తిగా పడిపోయింది.



లైడ సమీపంలోని మలుపు వద్ద పూర్తిగా పడిపోయిన రక్షణ గోడ

ప్రమాదాలు జరిగితేనే..

2021 ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి ఘాట్‌రోడ్డు హెయిర్ పిన్ బెండ్ 5 మలుపు వద్ద ప్రైవేటు బస్సు 70 అడుగుల లోయలో పడిన ఘటనలో నలుగురు మృత్యువాత పడగా, 22 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. హైదరాబాద్ షేక్‌పేటకు చెందిన 25 మంది కుటుంబ సభ్యులు దినేశ్ ట్రావెల్‌కు చెందిన ప్రైవేటు బస్సులో అరకు అందాలను తిలకించేందుకు వచ్చి, తిరుగు ప్రయాణంలోని బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో ఈ ఘటన జరిగింది. వెనువెంటనే స్పందించిన జాతీయ రహదారులు సంస్థ ఘాట్‌రోడ్డులోని కొంతవరకు రక్షణ చర్యలు చేపట్టింది. రక్షణ గోడలకు సున్నాలు వేసి, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. అలాగే ప్రమాదకరమైన మలుపుల వద్ద ఐరన్ వాల్స్ ఏర్పాటు చేసింది. అయితే ఇటీవలే జరుగుతున్న ప్రమాదాల్లో ఐరన్ వాల్స్ సైతం పూర్తిగా పడిపోయాయి. జాతీయ రహదారుల సంస్థ స్పందించి ఘాట్‌రోడ్డులోని శిథిలావస్థకు చేరిన రక్షణ గోడలను నిర్మించి, కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

తహసీల్దార్ల పోస్టింగుకు కోడ్ అడ్డంకి!

- స్పష్టత ఇవ్వాలని కోరుతూ ఈసీకి జిల్లా కలెక్టర్ లేఖ
- వారం నుంచి నిరీక్షణ
- ఈసీ అనుమతి వస్తేనే తదుపరి చర్యలు

తహసీల్దార్లుగావ్యవహరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు



అరకులోయ తహసీల్దార్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అల్లూరి జిల్లాలో తహసీల్దార్ల పోస్టింగ్‌కు అడ్డంకిగా మారింది. దీంతో ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. అక్కడి నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు తహసీల్దార్ల పోస్టింగ్‌పై స్పష్టత రానుంది. గత వారం రోజులుగా పోస్టింగ్‌ల కోసం తహసీల్దార్లు ఎదురు చూస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 22 మండలాలకు చెందిన తహసీల్దార్లను విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికలు ముగియడంతో జూలై నెలాఖరులో ఎక్కడి తహసీల్దార్లను అక్కడికి తిరిగి పంపేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయా తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చే క్రమంలో స్వల్ప మార్పులు చేస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వును జారీ చేసింది.

ఎన్నికలకు ముందు పనిచేసిన అసెంబ్లీ స్థానంలో కాకుండా జిల్లా యూనిట్‌గా తీసుకుని వేరే అసెంబ్లీ నియోజకవర్గంలో తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. వివిధ జిల్లాలో పనిచేసిన తహసీల్దార్లు అక్కడ నుంచి రిలీవయ్యారు. అలాగే ఈ జిల్లాలో పనిచేస్తున్న ఆయా ప్రాంతాలకు చెందిన తహసీల్దార్లు ఇక్కడ నుంచి రిలీవ్ అయి ఆయా జిల్లాల్లో విధుల్లో చేరారు.

పోస్టింగ్ కోసం వారం నుంచి ఎదురుచూపులు

తమ పోస్టింగ్‌ల కోసం వారం నుంచి జిల్లాలోని తహసీల్దార్లు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఈ జిల్లాకు చెందిన తహసీల్దార్లు వారి ఆసక్తిని కనబరచి పలువురు అనకాపల్లి, మరికొంతమంది విశాఖపట్నం జిల్లాలకు పోస్టింగ్‌లు కావాలని కోరారు. వారం క్రితమే విశాఖ జిల్లాలో తహసీల్దార్ల పోస్టింగ్ ప్రక్రియ పూర్తికాగా, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో ఈప్రక్రియను చేపట్టే క్రమంలో సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో తహసీల్దార్ల పోస్టింగ్‌లకు సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టాలనేది సూచించాలని కోరుతూ కలెక్టర్ దినేశ్‌కుమార్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. దానిపై ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే సూచనలు అనుసరించి తహసీల్దార్ల పోస్టింగ్‌లపై తదుపరి చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ యంత్రాంగం భావిస్తున్నది. దీంతో జిల్లా కలెక్టర్ మొదలుకుని తహసీల్దార్ వరకు అందరూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తున్నారు.

తహసీల్దార్ల బాధ్యతలు నిర్వహిస్తున్న డీటీలు

వారం రోజులుగా జిల్లాలోని తహసీల్దార్లంతా ఇళ్లకే పరిమితమయ్యారు. నాలుగు నెలలు ఇతర జిల్లాల్లో పనిచేసిన వారిని అక్కడి నుంచి రిలీవ్ చేయడంతో సొంత జిల్లాకు వచ్చేశారు. కాని ఇక్కడ పోస్టింగ్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో ప్రస్తుతం ఇళ్లలోనే కాలం గడుపుతున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయాల్లో ఉండే డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జి తహసీల్దార్లుగా వ్యవహరిస్తూ మండలాల్లోని రెవెన్యూ కార్యకలాపాలను సాగిస్తున్నారు. వారం పైబడి ఎటువంటి పోస్టింగ్ లేకుండా ఇళ్లకే పరిమితం కావడం రెవెన్యూ చరిత్రలో బహుశా ఇదే ప్రప్రథమమని పలువురు తహసీల్దార్లు అంటున్నారు. ఎన్నికల కోడ్ వంటి ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలోనే ఇటువంటి అరుదైన పరిస్థితి ఏర్పడిందని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి.



అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఉచిత పార్య, నోట్ పుస్తకాలు అందజేసిన కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి, డీఐఈవో అప్పలరాం

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పార్య, నోట్ పుస్తకాలు

పంపిణీ చేసిన డీఐఈవో అప్పలరాం

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన అరకులోయ విద్యార్థులు

అరకులోయ, ఆగస్టు 5:

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచిత పార్య, నోట్ పుస్తకాల పంపిణీకి చర్యలు చేపట్టింది. ఇప్పటికే అన్ని కళాశాలలకు పుస్తకాలను తరలించింది. ఆయా కళాశాలల్లో విద్యార్థులకు అధికారులు పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న 700 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పార్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను సోమవారం జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి (డీఐఈవో) అప్పలరాం, కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పుస్తకాల వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు కొంతమేర ఆర్థిక భారం తగ్గనుంది. ప్రాక్టికల్స్‌కు అవసరమైన రికార్డులు కూడా అందజేస్తామని డీఐఈవో ప్రకటించారు. నాలుగేళ్ల తర్వాత ఉచితంగా పార్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఐఈవో అప్పలరాం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. జీవితంలో ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమైనదని, ప్రతి ఒక్కరూ ఉజ్వల భవిష్యత్తుకు కష్టపడి చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీపై కూటమి భేటీ

- అభ్యర్థిత్వంపై చర్చ
- పోటీకి నలుగురు సుముఖం
- జాబితాలో గండి బాబ్జీ, పీలా గోవింద్, పీవీజీ కుమార్, తాతయ్యబాబు
- బైరి దిలీప్ చక్రవర్తి పేరు కూడా పరిశీలన
- అధినేతకు ఐదుగురి పేర్లు పంపాలని నిర్ణయం



ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై సమావేశమైన ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు నేతలు ఆసక్తి చూపుతున్నారు. ఈ జాబితాలో మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ఉన్నారు. సోమవారం రాత్రి నగరంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంట్లో కూటమికి చెందిన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీల బలాబలాలు చర్చించిన నేతలు పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎన్నికలకు అవసరమైన ఖర్చును భరించేందుకు గండి బాబ్జీ, పీలా గోవింద, తాతయ్యబాబు, పీవీజీ కుమార్‌లు సిద్ధమయ్యారు.

ఈ సందర్భంగా అధిష్ఠానం సూచన మేరకు అనకాపల్లి ఎంపీ సీటు ఆశించిన బైరా దిలీప్ చక్రవర్తి అభ్యర్థిత్వంపై కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైతే క్యాంపులు నిర్వహించాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. అభ్యర్థిత్వం ఆశిస్తున్న గండి బాబ్జీ, పీలా గోవింద్, తాతయ్యబాబు, పీవీజీ కుమార్, దిలీప్ చక్రవర్తి పేర్లు అధినేతకు పంపాలని సమావేశం నిర్ణయించింది. పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, పి.విష్ణుకుమార్‌రాజు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీలు బుద్దా నాగజగదీశ్వరరావు, పీఎస్‌వీ మాధవ్, దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శీతంరాజు సుధాకర్, బీజేపీ నగర అధ్యక్షుడు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్

- 13వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- ఉపసంహరణకు 16 వరకూ గడువు
- 30న పోలింగ్
- విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

-వార్త 8వ పేజీలో...

సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై జీఎస్ఐ సర్వే

తొమ్మిది ప్రాంతాల పరిశీలన

సీలేరు, ఆగస్టు 5:

జీకేవీధి మండలం సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందం సోమవారం విస్తృతంగా సర్వే నిర్వహించింది. ఢిల్లీ నుంచి వచ్చిన జియోలాజికల్ సర్వే బృందం స్థానిక పంప్డ్ స్టోరేజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖరరెడ్డితో కలిసి తొమ్మిది ప్రాంతాలను సందర్శించింది. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన వ్యాప్‌కోస్ సంస్థ తయారు చేసిన డీపీఆర్ ఆధారంగా పరిశీలన చేసింది. ఇందులో జలవిద్యుత్ కేంద్రం నిర్మించే పార్వతీనగర్, టన్నెల్ నిర్మించే ప్రాంతం, గుంటవాడ జలాశయం, డంపింగ్ యార్డు తదితర ప్రాంతాలను బృందం సందర్శించి, అక్కడ పరిస్థితిని అంచనా వేసింది. ఈ సందర్భంగా జీఎస్ఐ సభ్యులకు ప్రాజెక్టు గురించి ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి విపులంగా వివరించారు. కార్యక్రమంలో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏడీఈ టి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీని డోలీగా మలచి..

అనారోగ్యం బారిన పడిన దివ్యాంగుడిని డోలీపై ఆస్పత్రికి తరలింపు

- ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని విధంగా తూలం గ్రామం
- పక్కా రహదారి నిర్మించాలని గ్రామస్థుల వేడుకోలు



చంద్రయ్యను డోలీపై తీసుకువెళుతున్న కుటుంబీకులు

పెదబయలు, ఆగస్టు 5:

ఆధునిక యుగంలోనూ గిరిజనులకు కష్టాలు తప్పడం లేదు. కనీస అవసరాలు లేకపోవడంతో అనారోగ్యం సమయంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు మండలంలోని ఇంజరీ పంచాయతీ తూలం గ్రామంలో అనారోగ్యం బారిన పడిన దివ్యాంగుడిని తరలించడానికి గ్రామస్థులు అష్టకష్టాలు పడ్డారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని తులం గ్రామానికి కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేదు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొరవంగి చంద్రయ్య అనారోగ్యం బారిన పడ్డాడు. అతడిని ఆస్పత్రిలో చేర్పించేందుకు కుటుంబసభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంట్లో ఉన్న ప్లాస్టిక్ కుర్చీకి తాడుతో కర్రను కట్టి డోలీగా చేసి అందులో చంద్రయ్యను కూర్చోబెట్టి రెండున్నర కిలోమీటర్లు బురదలో జారుకుంటూ ఎర్రబయలు వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ప్రైవేటు వాహనంలో విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చంద్రయ్య ఐదేళ్ల క్రితం సైకిల్ తొక్కుతూ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో మోకాళ్ల వరకు కాలు తీసేశారు. మూడు నెలల తర్వాత అదే కాలుకు మళ్లీ గాయమేర్పడడంతో మంచాన పడ్డాడు. స్థానిక యువకులు సోషల్ మీడియా ద్వారా దాతల సాయాన్ని అందించడంతో కొందరు చేసిన సాయంతో ఆస్పత్రిలో చేర్పించారు. తమ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో రోగులు, గర్భిణులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తూలం గ్రామానికి పక్కా రహదారి నిర్మించాలని కోరారు.

మోదకొండమ్మ పాదాలు తాకిన భానుడి కిరణాలు



పాదాలు తాకిన భానుడి కిరణాలు

పాడేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):

స్థానిక మోదకొండమ్మ ఆలయంలోని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి సోమవారం తెల్లవారుజామున భానుడి కిరణాలు తాకాయి. ఈ దృశ్యాన్ని భక్తులంతా ఆసక్తిగా తిలకించారు. సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా అమ్మవారి పాదాలును భానుడి కిరణాలు తాకడంపై ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, సభ్యులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

క్రైం... crime news

'కల్యాణపులోవ'లో తేలిన చినఅప్పారావు మృతదేహం


కల్యాణపులోవ రిజర్వాయర్‌లో తేలిన చినఅప్పారావు మృతదేహం

రావికమతం, ఆగస్టు 5 : రెండు రోజుల క్రితం అదృశ్యమైన గిరిజన యువకుడు చిన అప్పారావు సోమవారం కల్యాణపులోవ రిజర్వాయర్‌లో శవమై తేలాడు. చీమలపాడు పంచాయతీ శివారు దూకులమ్మపాడు గ్రామానికి చెందిన ఈదల చిన అప్పారావు అలియాస్ సంజీవి ఈనెల మూడో తేదీ నుంచి కనబడడం లేదని మృతుడు సోదరి గడ్డమ్మ కొత్తకోట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి రెండు రోజులుగా కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు, కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు. ఈ నేపథ్యంలో గ్రామానికి ఆనుకొని ఉన్న కల్యాణపులోవ రిజర్వాయర్‌లో సోమవారం చిన అప్పారావు శవమై తేలాడు. ఎస్‌ఐ లక్ష్మణరావు శవ పంచనామా చేసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్టు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి


పెనుగొల్లు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాద దృశ్యం

ఎస్.రాయవరం, ఆగస్టు 5: మండలంలోని పెనుగొల్లు వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొని అదే గ్రామానికి చెందిన బత్తిన అప్పారావు(55) అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుగొల్లు గ్రామానికి చెందిన బత్తిన అప్పారావు, తుని వైపు నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో తన గ్రామం వద్ద రోడ్డు పక్క నుంచి నడిచి వెళుతున్నాడు. అక్కడ పక్కనే రెండు టిప్పర్ లారీలు ఆగి ఉన్నాయి. అప్పారావు వాటిని దాటుకొని కొంచెం ముందుకు వెళ్లే సరికి అదే మార్గంలో వస్తున్న మరో లారీ ఆగి ఉన్న టిప్పర్ లారీలను బలంగా ఢీకొంది. దీంతో ఓ టిప్పర్ లారీ ముందు వెళుతున్న అప్పారావు ఢీకొని అతని తల పైనుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


బత్తిన అప్పారావు (ఫైల్ ఫొటో)

రైలు ఢీకొని యువకుడు..


మృతుడు లక్ష్మీసాయి కుమార్ (ఫైల్ ఫొటో)

లంకెలపాలెం, ఆగస్టు 5: రైలు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకొంది. దీనికి సంబంధించి దువ్వాడ జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలి వున్నాయి. జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన మద్దుకూరి లక్ష్మీసాయికుమార్ (24) స్థానికంగా గల ఎలక్ట్రికల్ షాప్‌లో పనిచేస్తూ లంకెలపాలెంలోని బంధువుల ఇంట్లో నివాసముంటున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి షాప్‌నకు వెళ్లే క్రమంలో స్థానిక రైల్వే క్రాసింగ్ వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. తల్లి సత్యవతి ఉంది. తండ్రి గతంలోనే మృతి చెందాడు. లక్ష్మీసాయికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు దువ్వాడ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా బస్సు ఢీకొని లేబర్ మేస్త్రీ


మృతుడు కె.అప్పారావు (ఫైల్)

లంకెలపాలెం, ఆగస్టు 5: ఫార్మాసిటీలోని ఓ ప్రైవేటు ఫార్మా పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. జాతీయ రహదారి లంకెలపాలెం దరి శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకొంది. దీనికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామానికి చెందిన కె.అప్పారావు (63) స్థానికంగా లేబర్ మేస్త్రీ పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనులపై ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా శ్రీరామ్‌నగర్ కాలనీ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి ఫార్మా బస్సు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పారావు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అప్పారావుకు భార్య చంద్రమ్మ, కుమారుడు కనకరాజు, కుమార్తె లీలావతి ఉన్నారు. ప్రస్తుతం అనకాపల్లి మండల బీజేపీలో నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. పరవాడ సీఐ బాల సూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం


మృతి చెందిన చంద్రకాంత్ (ఫైల్)

డుంబ్రిగుడ, ఆగస్టు 5: అదృశ్యమైన యువకుడు జాముగుడ సమీపంలోని పొలం గెడ్డ వాగులో మృతి చెందినట్టు స్థానిక సీఐ రుద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత నెల 30న కంచరపాలెంకు చెందిన బంగారి కోటేశ్వరరావు, ఈశ్వరి దంపతుల కుమారుడు చంద్రకాంత్(17) అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కోర్రాయి పంచాయతీ జాముగుడ పొలం గెడ్డ వాగులో యువకుడు మృతి చెందినట్టు సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో క్లూస్ టీంతో పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

మెకానిక్ అనుమానాస్పద మృతి


అల్లు అప్పారావు (ఫైల్)

దేవరాపల్లి, ఆగస్టు 5: మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన క్రషర్లు, నీటి ఇంజన్లు మెకానిక్ అల్లు అప్పారావు(39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తెనుగుపూడి మారేపల్లి రోడ్డు మార్గంలో చెరకు తోటల్లో మృతదేహాన్ని పొలం పనులకు వెళ్లిన మహిళా కూలీలు సోమవారం గుర్తించడంతో వెలుగులోకి వచ్చింది. ఇంజన్ రిపేరు చేస్తానని చెప్పి శనివారం ఇంటి నుంచి వెళ్లిన తన భర్త ఇంటికి రాకపోవడంతో బంధువులతో కలిసి గాలించామని అప్పారావు భార్య దుర్గాలక్ష్మి భోరున విలపించింది. అప్పారావుకు పిల్లలు శ్యామ్ కళ్యాణ్, పూర్ణచందు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	77.00
లైవ్ ధర	97.00
విత్ స్కిన్	164.00
స్కిన్ లెస్	174.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

రైలు ప్రమాదం వెనుక సిబ్బంది నిర్లక్ష్యం

- ప్లాట్‌ఫారంపై అంతసేపు ఎందుకు ఉంచారు?
- బీ-6, బీ-7లలో గ్యాస్ సమస్య నిజమేనా!!
- స్మోక్ సెన్సార్ల సంగతి ఏమిటి?
- బీ-7టీటీఈ, ప్రయాణికులను విచారిస్తేనే నిజాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగిన కోర్బా ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం ఉందని చాలా స్పష్టంగా తెలుస్తోంది. ఈ ఘటనలో అనేక ప్రశ్నలకు సమాధానాలు లభించడం లేదు. రాయపూర్ నుంచి శనివారం బయలుదేరిన కోర్బా ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం 6.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. నాలుగో నంబరు ప్లాట్‌ఫారంపై ఆగగా, ప్రయాణికులు అంతా దిగి వెళ్లిపోయారు. ఇదే రైలు కోచింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లి క్లీనింగ్ ప్రక్రియ పూర్తిచేసుకుని తిరిగి స్టేషన్‌కు వచ్చి తిరుపతికి బయలుదేరి వెళుతుంది. కోచింగ్ కాంప్లెక్స్‌లో 22 కోచ్‌ల రైలును క్లీన్ చేయడానికి కనీసం నాలుగు గంటల సమయం తీసుకుంటారు. ఈ రైలు స్టేషన్‌కు వచ్చిన వెంటనే కోచింగ్ కాంప్లెక్స్‌కి వెళ్లాలి. తిరిగి ఒంటి గంటకల్లా స్టేషన్‌లో ఉండాలి. అప్పుడు తిరుపతి ప్రయాణికులు ఎక్కుతారు. అయితే ఏ కారణం చేతనో ఈ రైలును అదే ప్లాట్‌ఫారంపై వదిలేశారు. అగ్ని ప్రమాదం జరగడం, పొగలు రావడంతో 9.45 గంటలకు గుర్తించి సహాయక చర్యలు చేపట్టారు.

- కోచింగ్ కాంప్లెక్స్‌లో దీనిని శుభ్రం చేసేందుకు నాలుగు గంటలు పడుతుందంటున్నారు. అక్కడి నుంచి బయలుదేరి తిరిగి స్టేషన్‌కి ఒంటి గంటకు చేరుకోవాలంటే...ఈ రైలును ఉదయం 8 గంటల కల్లా కోచింగ్ కాంప్లెక్స్‌కు చేర్చాల్సి ఉంది. కానీ ఉదయం 9.45 గంటల వరకు ప్లాట్‌ఫారంపైనే ఉంది. దీనికి కారణం ఏమిటనేది తెలియడం లేదు. కొన్నిసార్లు ప్లాట్‌ఫారంపైనే డ్రై క్లీనింగ్ చేస్తారు. ఆదివారం షెడ్యూల్ ఏమిటనేది అధికారులు చెప్పడం లేదు. కోచింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లాల్సి ఉందని తెలిపారు.
- బీ-7, బీ-6 ఏసీ కోచ్‌లలో గ్యాస్ సమస్యతో ఏసీలు పనిచేయలేదని ప్రయాణికుల ఫిర్యాదు చేయడంతో విశాఖపట్నం చేరక ముందే విషయాన్ని ఆ రైలు సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. ఈ సమస్యను సరిచేయడానికైనా రైలును కోచింగ్ కాంప్లెక్స్‌కు తీసుకువెళ్లాల్సి ఉంది. కానీ అలా చేయలేదు. ఎక్కడైతే సమస్య ఉందని చెప్పారో ఆ కోచ్‌లలోనే మంటలు రేగాయి. అంటే ఆ సమస్యే ప్రమాదానికి కారణమా?...అనేది తేలాల్సి ఉంది.

టీటీఈ, ప్రయాణికుల విచారణ ముఖ్యం

ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ ప్రారంభించారు. అయితే ఈ రైలు విశాఖపట్నం చేరడానికి ముందు బీ-7, బీ-6 కోచ్‌లలో ప్రయాణించిన వారి జాబితా తీసుకుని, వారి నుంచి ఆ బోగీల సమస్యపై అడిగి తెలుసుకోవాలి. వారు ఏమైనా ఫిర్యాదు చేశారా?, టీటీఈ దానిని ఎవరి దృష్టికి తీసుకువెళ్లారు? అనే విషయాలు తెలుస్తాయి. అలాగే ఈ రెండు బోగీలలో ఏదైనా సమస్య తలెత్తితే టీటీఈ వద్ద కూడా కొంత సమచారం ఉంటుంది. వారి వాంగ్మూలాలు తీసుకొని, ఆ ప్రకారం విచారణ చేస్తే వాస్తవాలు బయటపడతాయి.

స్మోక్ డిటెక్టర్లు ఎందుకు పనిచేయలేదు?

ఏసీ కోచ్‌లలలో పొగ వచ్చిందంటే వెంటనే స్మోక్ డిటెక్టర్ దానిని గుర్తించి సైరన్ మోగిస్తుంది. మరి అంత దట్టమైన పొగలు వస్తే ఆ డిటెక్టర్లు ఎందుకు సైరన్ మోగించలేదు? అనేది తేల్చాలి. మిగిలిన కోచ్‌లలో అవి ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకోవలసిన అవసరం ఉంది.

సీసీ టీవీ ఫుటేజీ..?

రైల్వేస్టేషన్‌లో ప్రతి ప్లాట్‌ఫారంపైనా సీసీ టీవీ కెమెరాలు ఉన్నాయి.


రైలు నుంచి మంటలు, పొగలు (ఫైల్ ఫొటో)

నాలుగో నంబరు ప్లాట్‌ఫారంపైకి కోర్బా రైలు వచ్చిన దగ్గర నుంచి ప్రమాదం జరిగేంత వరకు ఏమి జరిగిందో ఫుటేజీ ఉంటుంది. దానిని పరిశీలిస్తే ఆ రెండు బోగీలు బీ-7, బీ-6 వద్ద ఏ సమయంలో ఏమి జరిగిందో తెలుస్తుంది. దాని ప్రకారం విచారణ సులువు అవుతుంది.

ప్రతి కోచ్‌కు జనరేటర్లు

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లకు పైలట్ కోచ్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుంది. దాంతో పాటు ప్రతి కోచ్‌కు జనరేటర్లు ఉంటాయి. ఏదైనా కారణంతో పైలట్ కోచ్ నుంచి విద్యుత్ రాకపోతే ఈ జనరేటర్లతో కోచ్ విద్యుత్ అవసరాలు తీరుస్తారు. బీ-7, బీ-6 కోచ్‌లో జనరేటర్లు ఎలా పనిచేస్తున్నాయి? వాటివల్ల సమస్య వచ్చిందా?..అనేది చూడాల్సి ఉంది.

అది ఖాళీ రైలు కిందే లెక్క

ప్రయాణికుల రైలును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరిన తరువాత బోర్డులు మార్చి ఇంకో ప్రాంతానికి పంపుతారు. ఆ మార్గంలో ఉన్నప్పుడు మాత్రమే ఆ రైలును ఆ పేరుతో వ్యవహరిస్తారు. బోర్డులు మార్చకుండా ప్లాట్‌ఫారంపై ఉంటే దానిని ఖాళీ రైలు(ర్యాక్)గానే పరిగణిస్తారు. దానికి ఏ పేరు ఉండదు. ఇప్పుడు ఈ ప్రమాదం కోర్బా రైలులో జరిగిందని ప్రచారం జరుగుతోంది. దీనిని రైల్వే వర్గాలు ఖండిస్తున్నాయి. ప్రమాదం జరిగిన సమయానికి అది ఖాళీ ర్యాక్ అని, ఆ విధంగానే చూడాలని సూచిస్తున్నాయి.

అగ్ని ప్రమాదంపై విచారణ ప్రారంభం

విశాఖపట్నం, ఆగస్టు 5: విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో సంభవించిన అగ్నిప్రమాదంపై అధికారులు ఉన్నత స్థాయి విచారణ చేపట్టారు. ఈ అగ్ని ప్రమాదంలో ఒక ఏసీ కోచ్ పూర్తిగా, మరో రెండు కోచ్‌లు పాక్షికంగా దగ్ధమైన సంగతి తెలిసిందే. ప్రయాణికులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసిన ఈ సంఘటనపై విచారణ చేపట్టేందుకు తూర్పుకోస్తారైల్వేకు చెందిన చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సూరత్ జానీ, చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజనీర్ ఎస్‌పీ బెహరా, చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ బీఎస్.నాథ్ సోమవారం వాల్తేరు రైల్వే ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ప్లాట్‌ఫారంపై నిలిచి ఉన్న రైలులో మంటలు చెలరేగి, కోచ్‌లు దగ్ధం కావడంపై దర్యాప్తు చేపట్టారు. ముందుగా కోచింగ్ యార్డు, నిర్వహణ డిపోలో ఉన్న కోచ్‌లను క్షుణ్ణంగా పరిశీలించి అక్కడి అధికారులు, సిబ్బందిని విచారించారు. అనంతరం స్టేషన్‌లో సిబ్బందిని కూడా విచారించి పలు వివరాలు సేకరించారు. మరోవైపు కోచ్‌లను తయారుచేసిన ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, లక్నో నుంచి రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్స్ ఆర్గనైజేషన్(ఆర్‌డీఎస్‌వో) ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోమవారం వాల్తేరు రైల్వే కార్యాలయానికి చేరుకున్నారు. మొత్తం ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ బృందం పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి ప్రమాదం జరగడానికి గల కారణాలపై నివేదిక సమర్పించనున్నది.

అధ్వాన దారిలో అవస్థల ప్రయాణం


అనకాపల్లి వెళ్లే రోడ్డులో నారపాడు జంక్షన్ వద్ద దెబ్బతిన్న రోడ్డు


అనకాపల్లి- నారపాడు రోడ్డులో బలిజపాలెం తమురు చెరువు వద్ద ఛిద్రమైన రోడ్డు

- అనకాపల్లి- నారపాడు రోడ్డు గోతులమయం
- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు

సబ్బవరం, ఆగస్టు 5: సబ్బవరం-అనకాపల్లి జాతీయ రహదారి నుంచి నారపాడు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో అమ్ములపాలెం, బలిజపాలెం, నారపాడు, నల్లరేగులు పాలెం గ్రామాలకు వెళ్లే ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కూడా లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలే ఆధారం. ఈ రోడ్డు గత ఐదేళ్లుగా పూర్తిగా దెబ్బతినడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. నారపాడు జంక్షన్ నుంచి సబ్బవరం పరిధిలో అర కిలోమీటరు మేర రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఈ రోడ్డు బాగు చేయాలని గత కొన్ని పర్యాయాలుగా నారపాడు సర్పంచ్ మామిడి శంకరరావు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధి కారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

కేజీహెచ్‌లో హైడ్రామా

- సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన డాక్టర్ అశోక్‌కుమార్
- డీఎంఈ నుంచి తనకు సమాచారం లేదన్న ప్రస్తుత సూపరింటెండెంట్ శివానంద
- ఆర్డర్స్ వచ్చిన తరువాతే చేరతానంటూ వెళ్లిపోయిన పూర్వపు సూపరింటెండెంట్


డాక్టర్ శివానంద్


డాక్టర్ అశోక్‌కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం ఉదయం హైడ్రామా నెలకొంది. లైంగిక వేధింపుల ఆరో పణలు, అనంతరం తలెత్తిన పరిణామాల నేపథ్యంలో గత సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ రెండు నెలలపాటు సెలవులో వెళ్లిపోయారు. ఆయన సెలవుపై వెళ్లడంతో పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన డాక్టర్ శివానందకు ఉన్నతాధికారులు అప్పగించారు. తదు పరి ఉత్తర్వులు వచ్చేంత వరకు కొనసాగాలని పేర్కొన్నారు. అయితే, సోమవారం ఉదయం అకస్మాత్తుగా మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ఆస్పత్రి పరిపాలనా విభాగానికి వచ్చారు. సూపరింటెండెంట్ కార్యాలయంలోకి వెళ్లి తాను బాధ్యతలు తీసుకుంటానంటూ ప్రస్తుత సూప రింటెండెంట్ శివానందకు తెలిపారు. ఇరువురు సుమారు అర్ధగంటపాటు లోపల చర్చించుకున్నారు. అయితే, డీఎంఈ కార్యాలయం నుంచి తనకు ఎటువంటి ఆదేశాలు రాలే దంటూ శివానంద్ వెల్లడించారు. రీ పోస్టింగ్ ఆర్డర్స్ ఉంటే చూపించాలని కోరారు. రీ పోస్టింగ్ ఆర్డర్స్ తనకు రాలేదని, అయితే ఉన్నతాధికారులు మాత్రం బాధ్యతలు తీసుకోవాలని చెప్పినట్టు అశోక్ కుమార్ వెల్లడించారు. మౌఖిక ఆదేశాల ప్రకారం తాను బాధ్యతల నుంచి తప్పుకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని శివానంద్ చెప్పగా, లిఖిత పూర్వక ఆర్డర్స్ వచ్చిన తరువాతే చేరతానంటూ అశోక్ కుమార్ వెళ్లిపోయారు. ఈ వ్యవహారం ఆస్పత్రిలో చర్చ నీయాంశంగా మారింది. ఇదిలావుంటే సూపరింటెండెంట్ పోస్టుపై డీఎంఈ స్థాయిలో నిర్ణయం జరిగిందని చెబు తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టమైన ఆదే శాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి ముందస్తు సమాచారం ఉండడం వల్లే డాక్టర్ అశోక్‌కుమార్‌కు వచ్చారా?, లేక ఇంకేదైనా కారణం ఉందా?...అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉందని చెబుతున్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి అచ్చెన్నాయుడును కోరిన సంఘం నాయకులు


మంత్రి అచ్చెన్నాయుడుకు సమస్యలు వివరిస్తున్న శ్రీరామ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 5: గొర్రెలు, మేకలు పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ, పశు సంవర్ధకశాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడును విజయవాడలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేసినట్టు గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్, కార్యదర్శి కిలారి పెదబ్బాయి తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అంటువ్యాధులు ప్రబలి గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయన్నారు. దీని వల్ల పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించామన్నారు. అన్ని రకాల నాణ్యమైన టీకాలు, డీవార్మింగ్ మందులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. గొర్రెలు, మేకలు పెంపకందారులకు రూ.10 వేల కోట్లు కేటాయించి ప్రతి పెంపకందారుడికి 50 శాతం సబ్సిడీతో రూ.ఐదు లక్షలు రుణాలు ఇవ్వాలని కోరామని వారు తెలిపారు. అన్ని జీవాలకు ప్రభుత్వమే ఉచితంగా బీమా చేసి ఒక్కొక్క జీవానికి రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి 50 శాతం సబ్సిడీతో రూ.15 వేలు విలువ గల మేలురకం విత్తన పొట్టేళ్ల ఇవ్వాలని కోరామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు నిండిన పెంపకందారులకు పింఛన్ మంజూరు చేయాలని కోరామన్నారు. గొర్రెల కాపరుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మంత్రిని కోరినట్టు వారు తెలిపారు.

'చట్ట ప్రకారమే ఆ భూమి కొనుగోలు చేశాం'

అచ్యుతాపురం, ఆగస్టు 5: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం హరిపాలెంలో తాము చట్ట ప్రకారం భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నామని, కత్రి శివశంకర్ గణేష్, చోడిపల్లి మంగరాజు అనేవారు తెలిపారు. 'ఆగని వైసీపీ నేతల ఆగడాలు' అనే శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు వారు వివరణ ఇచ్చారు. హరిపురం సర్వే నంబర్ 102లో శృంగవరపు అమీరు కవి అనే ఎన్‌ఆర్‌ఐ పేరున కొంత భూమి ఉందని, అందులో సుమారు 27 సెంట్లకు ఆయన నుంచి జీపీ పొందిన అచ్యుతాపురం మండలం చోడపల్లికి చెందిన పంచదార్ల గజ్జాలు నుంచి తాము కొనుగోలు చేసినట్టు శివశంకర్ గణేష్ తెలిపారు. తాను కొనుగోలు చేసిన భూమికి గత నెల 27న సరిహద్దులు నిర్ణయించడానికి గజ్జాలు, సరిహద్దుదారులతో పాటు వెళ్లగా ఆ భూమికి ఎటువంటి సంబంధం లేని అచ్యుతాపురం మండలం చోడపల్లికి చెందిన శ్రీమంతుల నవీన్‌కుమార్, అనకాపల్లికి చెందిన సూర్ల హేమంతకుమార్, మరికొంతమంది కలిసి తనపై దాడి చేశారని ఆరోపించారు. తాను ఆ భూమిని కొనుగోలు చేశానని, ఈ విషయంలో ఎటువంటి విచారణ జరిపినా తాను సిద్ధమేనన్నారు. అలాగే తనపై వచ్చిన ఆరోపణలు కూడా నిజం కావని చోడిపల్లి మంగరాజు అన్నారు. తాను సర్వే నంబరు 71/2బి1లో భూమిని కొనుగోలు చేశానని, ఎటువంటి విచారణకైనా తాను కూడా సిద్ధమేనన్నారు.

టిడ్కో గృహాలకు త్వరలో విద్యుత్ వెలుగులు


టిడ్కో గృహాలకు విద్యుత్ లైన్ కోసం సర్వే చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, ఆగస్టు 5 : మునిసిపాలిటీలో టిడ్కో గృహాలకు త్వరలో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రానుంది. బలిఘట్టంలోని 133/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ లైన్ వేయడానికి సర్వే చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్లు లేని నిరు పేదల కోసం 38 బ్లాకులలో 300, 360 చదరపు అడుగులు విస్తీర్ణంలో సింగిల్ బెడ్ రూమ్ ప్లాట్లు, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో డబుల్ బెడ్‌రూమ్ ప్లాట్లు నిర్మించారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పనలో నిర్లక్ష్యం చేయడంతో పనులు మందగించాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాలు పూర్తి చేసిన టిడ్కో గృహాలు 1,124 ఉన్నాయి. ఈ ప్లాట్లకు 3.6 మెగావాట్లు విద్యుత్ అవసరమని ఈపీడీసీఎల్ అధికారులు అంచనా వేశారు. మొత్తం ఐదు మెగావాట్ల సామర్థ్యంతో సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే విద్యుత్ సమస్య తలెత్తదని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఏపీ టిడ్కో సంస్థ ఈపీడీసీఎల్‌కి రూ.7 కోట్లు చెల్లించింది. బలిఘట్టంలో 5 ఎంవీఏ సామర్థ్యంతో విద్యుత్ సబ్ స్టేషన్ సిద్ధం చేశారు. మూడు ఫీడర్లు మీద విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఇప్పటికే 38 బ్లాకులకు విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు అమర్చారు. బలిఘట్టంలోని 133/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ లైన్ వేయడానికి సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే విద్యుత్ సరఫరా చేయడానికి వీలు పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణారావు తెలిపారు.

10 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

- 2 బైకులు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం


గంజాయిని, నిందితులను అరెస్టు చేసిన సీలేరు పోలీసులు

సీలేరు, ఆగస్టు 5 : ఒడిశా నుంచి సీలేరు మీదుగా మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న 10 కిలోల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వివరాలిలా ఉన్నాయి. సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మారెమ్మ ఆలయం వద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై ఒడిశా నుంచి ముగ్గురు వ్యక్తులు వస్తుండగా వాటిని తనిఖీ చేయగా.. రెండు ప్యాకెట్లలో పది కిలోల గంజాయి లభ్యమైందన్నారు. బైకులపై వచ్చిన సీలేరు దుర్గావీధికి చెందిన మండి శిరామ్ (28), చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముదిలిగూడకు చెందిన పదో తరగతి చదువుతున్న పాంగి సునీల్ (18), నెల్లూరుకు చెందిన దక్షిణకుమార్‌లను అరెస్టు చేసినట్టు చెప్పారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- ఎమ్మెల్సీ ఎన్నికకు 838 మంది ఓటర్లు
- 10వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరణ
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు 838 మందితో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశామని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 636 మంది ఎంపీటీసీ సభ్యులు, 36 మంది జడ్పీటీసీ సభ్యులు, 97 మంది కార్పొరేటర్లు, 53 మంది మునిసిపల్ కౌన్సిలర్లు, ఇంకా ఎక్స్‌అఫీషియో సభ్యులు 16 మంది ఓటర్లుగా ఉంటారన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఈనెల 10వ తేదీ వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేస్తామని, అదేరోజు నుంచి 13వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్లు దాఖల సమయంలో అభ్యర్థిని పది మంది బలపర్చాల్సి ఉంటుందని, ఎన్నికల ఖర్చుపై ఎటువంటి పరిమితులు లేవన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు తహసీల్దారు నేతృత్వంలో మండల స్థాయిలో కమిటీలు వేశామన్నారు. రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేశామని ఆయన వివరించారు.

ఎక్స్‌అఫీషియో సభ్యులుగా పేర్ల నమోదుకు వైసీపీ నేతల దరఖాస్తు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా తమ పేర్లు నమోదు చేయాలని వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, నిరంజనరెడ్డి కోరా రు. ఈ మేరకు ముగ్గురూ దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ముగ్గురు ఎంపీలు జీవీఎంసీలో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్నారు. దరఖాస్తులు పరిశీలించిన తరువాత అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

గిరి ప్రదక్షిణలో లక్షలాది కొబ్బరికాయలు వినియోగం

సింహాచలం, ఆగస్టు 5 : గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు లక్షలాది కొబ్బరికాయలను వినియోగించారు. ఉత్సవానికి ముందు, ఆ తరువాత తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టడం ఆనవాయితీ. ఈమేరకు యాత్ర ప్రారంభానికి ముందు, తరువాత కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తులు కొట్టిన కొబ్బరికాయలు సుమారు ఐదు టన్నులు ఉన్నట్టు అంచనా. ఉత్సవం ముగిసి పదిహేను రోజులు దాటినా కొబ్బరి ముక్కలను తరలించే పని ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ 15 రోజులు వర్షాలు కురవడంతో వాటిని ఎండబెట్టారు. ముక్కల నుంచి చిప్పలను వేరు చేయడానికి, తడిసిన ముక్కలను ఎండబెట్టడానికి తుని నుంచి రోజుకు రూ. 1000 చొప్పున పది మంది కూలీలను కాంట్రాక్టర్ రప్పించారు.

పాడేరులో ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి

పాడేరు రూరల్, ఆగస్టు 5: జిల్లా కేంద్రం పాడేరు మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు, చిరు వ్యాపారులు సహకరించాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవరపల్లి నవీన్ కుమార్ కోరారు. పట్టణంలోని బడా, చిరువ్యాపారులతో సోమవారం సీఐ కార్యాలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశాన్ని నిర్వహించారు. పాడేరు జిల్లా కేంద్రంగా మారిన తరువాత ప్రధాన రహదారుల్లో వాహనాల రద్దీ అధికం కావడంతో ప్రయాణికులు, పట్టణ ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రధాన రహదారికిరువైపులా ఉన్న పెద్ద షాపుల యజమానులతో పాటు పీటీడీ కాంప్లెక్స్, సినిమాహాలు సెంటర్, పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ కూడలి, మెయిన్ బజారులో చిన్న వ్యాపారులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొనేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. సరకుల కొనుగోలుకు వచ్చేవారు తమ వాహనాన్ని రోడ్డు మార్జిన్ దిగి నిలిపేలా వ్యాపారులే చెప్పాలన్నారు. వ్యాపారులు మాట వినకుండా దుకాణ సముదాయాల వద్ద వాహనాలను అడ్డంగా ఎవరైనా నిలుపుదల చేస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని, వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ జి.లక్ష్మణరావు, వర్తక సంఘం నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

సమస్యలపై స్కీమ్ వర్కర్ల ఆందోళన

» పీఎంఆర్సీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ



కలెక్టరేట్‌కు భారీ ర్యాలీగా వెళ్తున్న స్కీమ్ వర్కర్లు

పాడేరు రూరల్, ఆగస్టు 5: సమస్యలపై స్కీమ్ వర్కర్లు సోమవారం ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్రం పాడేరులో పీఎంఆర్సీ భవనం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్మికులు ఏ ప్రభుత్వానికి బానిసలు కాదన్నారు. ప్రభుత్వం అప్పగించిన పనులు కష్టమైనా ఇష్టపడి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు రక్షణగా ఉండాల్సిన ప్రభుత్వం అక్రమ తొలగింపులకు పాల్పడితే సహించేది లేదని అయన హెచ్చరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు వందలాది మందిని అక్రమంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలో అంగన్వాడీ కార్యకర్త పోస్టును రూ.90 వేలకు వేలం నిర్వహించడం దారుణమన్నారు. కార్మికులకు రాజకీయ కక్షలను అంట కలిపి చేస్తున్న పని నుంచి తొలగిస్తే సహించబోమని హెచ్చరించారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేసిన 2,365 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఏ కారణం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెలుగులో పనిచేసే కార్మికులకు కాపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ అందుబాటులో లేక పోవడంతో నిరసన అనంతరం డీఆర్వో పద్మావతికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బీ.పోతురాజు, వెలుగు వీవోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.భాను, రాజ్‌కుమార్, సీఐటీయూ జిల్లా సమాయ కార్యదర్శి కె.శంకరరావు, జి.సత్యనారాయణ, సోమలింగం, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం జిల్లా నాయకులు ఉబ్బేటి కోటేశ్వరరావు, పి.కృష్ణారావు, ఎం.సురేష్‌కుమార్, వివిధ కార్మిక సంఘాల నాయకులు దాసమ్మ, రాములమ్మ, పూర్ణిమ, పి.లక్ష్మీ, ఎం.జ్యోతి, వై.ఏసు రత్నం, పాడేరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన పలు శాఖల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లు సుమారు 400 మంది పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీడీపీవో ఝాన్సీరాణి

బిడ్డకు గంటలోపే ముర్రిపాలు పట్టాలి

» ఐసీడీఎస్ పీవో ఝాన్సీరాణి

పాడేరు రూరల్, ఆగస్టు 5: బిడ్డ పుట్టిన గంట వ్యవధిలోనే తల్లి ముర్రిపాలను బిడ్డకు అందించాలని సీడీపీవో ఝాన్సీరాణి వివరించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం మండల స్థాయిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వారోత్సవాలను ప్రతీ ఏటా ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తుంటారన్నారు. తల్లిపాలు బిడ్డకు ఔషధం వంటివి అన్నారు. పుట్టిన బిడ్డను పెంచడంలో తల్లి పాత్ర ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. తల్లిపాలు బిడ్డకు పోషకాలను అందించడమే కాకుండా పసి వయస్సులో వ్యాధుల బారి నుంచి కాపాడుతాయని వివరించారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలను ఆరు నెలల వరకు అందించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రం పాడేరులో ర్యాలీ చేపట్టారు. డబ్బా పాలు వద్దు-తల్లి పాలు ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఎంపీడీవో కార్యాల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఊర్మిళరెడ్డి, రాజేశ్వరి, కవిత, లక్ష్మీ, అచ్చయ్యమ్మ, రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

సీలేరులో ఒడిశా భక్తుల సందడి


సీలేరులో శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఒడిశా భక్తులు

సీలేరు, ఆగస్టు 5: గూడెంకొత్తవీధి మండలం సీలేరులో సోమవారం ఒడిశాకు చెందిన బోల్‌బామ్ మాలలను ధరించిన శివ భక్తులు శివనామ స్మరణతో సందడి చేశారు. ఒడిశా చిత్ర కొండ బ్యాల్ పరిధిలోని 11, 12వ నంబర్ల విలేజ్‌లకు చెందిన సుమారు 60 మంది బోల్‌బామ్ మాలను ధరించిన శివభక్తులు సోమవారం వారి గ్రామం నుంచి సీలేరుకు కాలినడకన భజనలు చేసుకున్నారు. ఈ భక్తులంతా వారి గ్రామం నుంచి ప్రవహించే వాగు నుంచి కావిళ్లతో తీసుకొచ్చిన నీటితో శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం ఆలయ పూజారి ఒడిశా నుంచి విచ్చేసిన బోల్‌బామ్ మాలను ధరించిన భక్తులందరికీ ప్రత్యేక పూజను నిర్వహించారు. వీరు ప్రతీ ఏటా ఆశాఢ మాసంలో రెండో వారం నుంచి శ్రావణ మాసంలోని రాఖీ పౌర్ణమి వరకు నెల రోజుల పాటు ఎంతో దీక్షగా శివును ప్రార్థిస్తామని, నెలలో ప్రతీ సోమవారం శివాలయాలకు తమ గ్రామంలో ప్రవహించి వాగు నుంచి స్వచ్ఛమైన నీటిని కావుళ్లతో తీసుకెళ్లి అభిషేకం చేసి పూజలను నిర్వహిస్తామని, రాఖీ పౌర్ణమికి ఒడిలో ప్రముఖ శైక్షేత్రమైన గుప్తేశ్వర్ ఆలయంలో శివును దర్శించుకుని బోల్‌బామ్ దీక్షలను విరమిస్తామని ఒడిశా భక్తులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై వైసీపీ నేతల సమావేశం

పాడేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై సోమవారం ఇక్కడ ఒక కల్యాణ మండపంలో వైసీపీ నేతలు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణను వైసీపీ ప్రకటించడంతో అయన మేనల్లుడైన చినశ్రీను ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, కుంభా రవిబాబు, పలువురు ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు సమావేశమయ్యారు. వైసీపీ చెందిన ప్రజాప్రతినిధులంతా విధిగా బొత్స సత్యనారాయణకు ఓట్లేయాలని ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ అలాగే పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల పరిధిలోని ప్రతి ఓటు వైసీపీకే పడేలా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కృషి చేయాలని ఆయన సూచించారు.

జాముగుడలో 20 మందికి వైద్య సేవలు

డుంబ్రిగుడ, అగస్టు 5: గుంటగన్నెల పంచాయతీ జాముగుడ గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో వివిధ రకాల వ్యాధులతో బాధ పడుతున్న 20 మందికి వైద్య పరీక్షలు చేశారు. 18 సంవత్సరాలు పైబడిన వారితో పాటు పలు దుర్వ్యసనాలు ఉన్న వారికి కూడా టీకాలు వేశారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలు భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వల్ల కలిగే లాభాలపై గిరిజనులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కెరవీంద్ర సుబ్బలక్ష్మి, భానుమతి పాల్గొన్నారు.

టేక్ హోం రేషన్ వినియోగించుకోండి

» ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి


సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, జూలై 5: గర్భిణులు, బాలింతలు టేక్ హోం రేషన్ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఐసీడీఎస్ అధికారులతో కలిసి ప్రాజెక్టు డైరెక్టర్ సీమంతాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో టీహెచ్ఆర్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతీ గర్భిణి, బాలింతకు మూడు కిలోల బియ్యం, అర కిలో ఆయిల్, కిలో కందిపప్పు, రెండు కిలోల మల్టీగ్రేన్ ఆటా, ఐదు లీటర్ల పాలు, 25 గుడ్లు, కిలో రాగి పిండి, అరకిలో ఖర్జూరం, చిక్కీ, బెల్లం అందజేస్తున్నామన్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు 30 గుడ్లు, మూడు లీటర్ల పాలు, రెండు కిలోల బాలామృతం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం వల్ల శిశువులకు పూర్తి స్థాయిలో పాలు పెట్టవచ్చునన్నారు. గర్భిణులు కచ్చితంగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలన్నారు. ప్రసవ సమయానికి ముందుగా ఆస్పత్రిలో చేరాన్నారు. గర్భిణులు వైద్యుల పర్యవేక్షణలో ప్రసవం పొందడం వల్ల మాతాశిశు మరణాలు నియంత్రించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.రామకృష్ణ, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, సీడీపీవో రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు కె.విజయకుమారి, గౌహర్‌ఉన్నీష, సత్యవతి, గౌరి, అప్పల నర్సమ్మ, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

పాడేరు-జి.మాడుగుల బస్సు మొరాయింపు

తరచూ ఇదే తంతు.. పిట్‌నెస్ లేని బస్సులతో ప్రయాణికుల ఇక్కట్లు

వారంలో ఇది రెండో సారి.. పట్టించుకోని అధికారులు



జి.మాడుగులలో నిలిచిపోయిన పాడేరు-గూడెకొత్తవీధి బస్సు... ఇటీవల కె.కోడాపల్లిలో నిలిచిపోయిన చింతపల్లి వెళ్లాల్సిన బస్సు

జి.మాడుగుల, ఆగస్టు 5: పిట్‌నెస్ లేని బస్సులతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. పాడేరు నుంచి చింతపల్లి, గూడెంకొత్తవీధి ప్రాంతాల్లో వెళ్ల ఆర్టీసీ బస్సులు తరచూ సాంకేతిక లోపాల కారణంగా మార్గమధ్యంలో మొరాయిస్తున్నాయి. జి.మాడుగులలో నిలిచిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవలే 1న గురువారం పాడేరు నుంచి చింతపల్లి వెళ్లాల్సిన బస్సు సాంకేతిక కారణంతో కె.కోడాపల్లిలో నిలిచిపోయింది. తాజాగా సోమవారం పాడేరు నుంచి గూడెంకొత్తవీధి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు జి.మాడుగులలో వచ్చి మొరాయించింది. దీంతో పాడేరు నుంచి వచ్చే మరో బస్సుకోసం చీకటి వరకు వేచిఉండాల్సిన పరిస్థితి ప్రయాణీల్లో నెలకొంది. ఇలా పాడేరు నుంచి బయలుదేరి కొంత దూరంలోనే బస్సులు మొరాయించడంతో ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం అనుకుంటే దానికి భిన్నంగా ఉందని అధికారుల తీరును పలువురు విమర్శిస్తున్నారు.

మరో పసి బిడ్డ మృతి

» ఐదుకు చేరిన మృతుల సంఖ్య

చింతూరు, ఆగస్టు 5: మన్యంలో మరో పసిబిడ్డ ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. తెలంగాణ రాష్ట్రం భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో కలిపి వారం వ్యవధిలో మృతి చెందిన చిన్నారుల సంఖ్య ఐదుకు చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం వంకగూడేనికి చెందిన మహేష్ దంపతుల నాలుగు నెలల బిడ్డ నాలుగు రోజులుగా జలుబు, దగ్గుతో బాధపడు తోంది. దీంతో సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. పసిబిడ్డను పరీక్షించిన వైద్యులు ఆరోగ్య స్థితి గతులపై తల్లి రమ్యను ఆరా తీశారు. తమ బిడ్డ నాలుగు రోజలుగా జలుబు, దగ్గుతో బాధపడుతోందని తల్లి వివరించింది. తనతో పాటు రెండుసార్లు తన బిడ్డకు కూడా నాటు మందులి చ్చినట్టు చెప్పుకొచ్చింది. ఇదిలా ఉండగా ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తుండగానే సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఆ పసిబిడ్డ శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిపడింది. గమనించిన వైద్యులు మెరుగైన చికిత్సకోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పది నిమిషాల వ్యవధిలోనే ఆ బిడ్డ మృతి చెందింది.

ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్

13వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ: జిల్లా కలెక్టర్

విశాఖపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల కోటాలోని ఎమ్మెల్సీ ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల కానున్నదని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీంధిర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ జారీచేసిన రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి 13వ తేదీ వరకు (ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఓటర్లుగా ఉంటారన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఎన్నికల అధికారిగా, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, మూడు జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ఈనెల 14న నామినేషన్లు పరిశీలిస్తామన్నారు. నామినేషన్లు ఉపసంహరణకు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ గడువు ఉంటుందన్నారు. తదుపరి బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటించి బ్యాలెట్ ముద్రణ చేపడతామన్నారు. ఎన్నికల్లో ఈవీఎంలు ఉండవని, కేవలం బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తామన్నారు. ఈనెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామని, కేంద్రాల వివరాలను రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తామన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. కోడ్ ఉన్నందున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయరాదన్నారు. మూడు జిల్లాల్లో రాజకీయ నాయకులు ఏర్పాటుచేసే సమావేశాలకు అధికారులు హాజరుకారాదని స్పష్టంచేశారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్వో సీతారామమూర్తి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్ల సమావేశానికి హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినప్పటికీ, అందుకు ఎన్నికల కమిషన్ అంగీకరించలేదు. దీంతో కలెక్టర్ దినేశ్‌కుమార్ సీఎం నిర్వహించిన సమావేశంలో పాల్గొనే అవకాశం దక్కలేదు. సమావేశం ప్రారంభానికి ముందు తిరుగు ప్రయాణమయ్యారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్లు సీఎం చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంటున్నారు.

బొర్రా గుహలను కాపాడాలని మంత్రికి ఎంపీ వినతి



అరకులోయ, ఆగస్టు 5: సహజసిద్ధంగా ఏర్పడిన బొర్రా గుహలును రక్షించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను అరకు ఎంపీ డాక్టర్ తనుజారాణి కోరారు. బొర్రా గుహలుపై నుంచి కిరండోల్-కొత్తవలస డబ్లింగ్ పనుల్లో భాగంగా గుహలుపై నుంచి రైల్వే ట్రాక్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, దీంతో గుహలు మనుగడకే ప్రమాదం ఉందని, లక్షలాది మంది సందర్శకులకు గుహలు తిలకించే పరిస్థితి లేదని ఎంపీ వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి వాల్తేర్ డీఆర్ఎంకు ఫోన్‌చేసి వివరాలను తెలుసుకున్నారని, గుహలుపై నుంచి ట్రాక్ ఎలైన్‌మెంట్ మారుస్తారనే నమ్మకం ఉందని ఎంపీ తనుజారాణి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రైల్వే మంత్రిని కలిసిన సమయంలో ఎంపీలు మిధున్‌రెడ్డి, గురుమూర్తి ఉన్నట్టు తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న పాఠశాలల పరిశీలన


టొంగికోటలో నేలమట్టమైన భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 5: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పాఠశాలలను ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎంఈవో క్రిష్ణమూర్తి పరిశీలించారు. వాటి తీరుతెన్నులను చూశారు. గాలి వాన కారణంగా పాఠశాలపై చెట్టుపడటంతో కూలిపోయిన టొంగికోట పాఠశాల భవనాని, పెదగూడ పంచాయతీ బాకుబేడలో చిన్నపాటి షెడ్డులో నిర్వహిస్తున్న పాఠశాలలను వారు చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పాఠశాల ప్రస్తుత స్థితిగతులను పరిశీలించి, పక్కా భవనాల నిర్మాణంకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అలాగే సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి సైతం దెబ్బతిన్న భవనాల వివరాలను తీసుకువెళ్లడం జరుగుతుందని అన్నారు. తాత్కాలిక షెడ్డును ఏర్పాటుకు తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లేదెలా..?

» కాలువ దాటడానికి కుడుముసారి విద్యార్థుల అవస్థలు


బురదగా ఉన్న కాలువ దాటి పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

చింతపల్లి, ఆగస్టు 5: మండలంలోని కుడుముసారి గ్రామ పంచాయతీ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. గ్రామం నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలకు చేరాలంటే కాలువ దాటాల్సి ఉంటుంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలో అధికంగా నీరు చేరడమే కాకుండా దారి అంతా బురదమయంగా మారింది. దీంతో విద్యార్థుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. రహదారిలో విద్యార్థులు జారిపడుతున్నారు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పిల్లలకు సహాయకులుగా తల్లిదండ్రులు కూడా వెళ్లాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం ఇదో పనిగా మారిందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలువ వద్ద కల్వర్టుతో పాటు సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

ఆదివాసీ చట్టాలను పరిరక్షించుకోవాలి

చింతపల్లి, ఆగస్టు 5: ఆదివాసీ హక్కులు, చట్టాలు పరిరక్షించుకోవాల్సి బాధ్యత అందరిపైనా ఉందని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి గెమ్మెలి మోహన్‌రావు అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో వివిధ సంఘాల నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని చింతపల్లిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భావితరాలకు గిరిజనుల హక్కులు, చట్టాలు తెలియజేయాల్సిన బాధ్యత విద్యావంతులు, ఉద్యోగులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు దేపూరి శశి కుమార్, బౌడు గంగరాజు, గెమ్మెలి కామేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తాబు పాఠశాలకు బెంచీల పంపిణీ

పాడేరు రూరల్, ఆగస్టు 5: గబ్బంగి పంచాయతీ పరిధిలోని కొత్తాబు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కూర్చొనేందుకు సోమవారం బెంచీలను అందించామని ఎంపీడీవో కెసాయి నవీన్ తెలిపారు. గత ఏడాది సెప్టెంబరులో డీపీవో, ఎంపీడీవో బృందం కొత్తాబు గ్రామాన్ని సందర్శించగా, విద్యార్థులు నేలపై కూర్చోవడం గమనించామని చెప్పారు. విద్యార్థులకు అవసరమయ్యే బెంచీలను అందించేందుకు సర్పంచ్‌ల సమావేశంలో నిర్ణయించామని, ఇందులో భాగంగా ఏడు బెంచీలను అందించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పీవీ.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మ్యుటేషన్లు వేగవంతం చేయండి

చింతపల్లి, ఆగస్టు 5: మండలంలో భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ టి.రామకృష్ణ ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు క్రయవిక్రయాలు చేసుకున్న భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు వీఆర్వో, సర్వేర్, ఆర్ఐలు చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాలను సిద్ధం చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించి సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరుగుతుందన్నారు. వీఆర్వోలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు మ్యుటేషన్లపై అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రుల భూములను మహిళలకు కూడా హక్కు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 5: గిరిజనులు గృహాలకు విధిగా దోమల మందు పిచికారీ చేయించుకోవాలని పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో దోమల నివారణ మందు పిచికారీ ప్రారంభించారు. తొలి రోజు సంపంగిగొంది, ఎర్రచెరువులు గ్రామాల్లో పిచికారీ చేశారు. ఈసందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధులను కలిగించే దోమలను నియంత్రించేందుకు ఏసీఎం ఐదు శాతం మందును పిచికారీ చేయడం జరుగుతుందన్నారు. కొంత మంది గిరిజనులు గృహంలో లోపల భాగంలో దోమల మందు పిచికారీ చేసుకోవడం వల్ల వాసన వస్తుందని, గృహాల రంగు పాడైపోతుందని నిరాకరిస్తున్నారన్నారు. ఈ మందుకు వాసన, రంగు ఉండదన్నారు. కేవలం దోమలపై మాత్రమే ప్రభావం చూపుతుందన్నారు. మలేరియా వ్యాధి నియంత్రించేందుకు ప్రతి ఒకరు దోమల మందును పిచికారీ చేయించుకుని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పారా మెడికల్ ఉద్యోగులు అచ్యుతరావు, జ్యోతి కుమారి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు కాలుష్యంతో అవస్థలు

చింతపల్లి, ఆగస్టు 5: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు కాలుష్యం వల్ల అవస్థలు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ టి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావులను సోమవారం విద్యార్థులు, అధ్యాపకులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ డంపింగ్ యార్డు వద్ద వ్యర్థాలకు మంట పెట్టడం వల్ల దుర్వాసన కలిగి పొగ వల్ల తీవ్ర ఇబ్బందిపడుతున్నామన్నారు. డంపింగ్ కార్డు వ్యర్థాల దుర్వాసన నేరుగా కళాశాలకు వస్తున్నదని, దీంతో వికారం చెంది వాంతులు, తలనొప్పి గురవుతున్నామని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి కళాశాలకు దూరంగా డంపింగ్ యార్డును నిర్వహించాలని, వ్యర్థాలకు మంట పెట్టకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయ అధికారి జగత్‌రాయ్ పాల్గొన్నారు.

కామర్స్‌పై విద్యార్థులకు పట్టు అవసరం

చింతపల్లి, ఆగస్టు 5: కామర్స్‌పై విద్యార్థులు పట్టు సాధించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వి. రమణ అన్నారు. సోమవారం కళాశాలలో జాతీయ వాణిజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ మానవులు నిత్యజీవితంలో కామర్స్ ఒక భాగమైపోయిందన్నారు. ఆర్థిక వృద్ధి, సంస్కృతిక మార్పును ప్రతిబింబిస్తుందన్నారు. అన్ని వర్గాల విద్యార్థులు కామర్స్‌ను నేర్చుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవీంద్రబాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా

» ఒకరికి తీవ్ర గాయాలు

కొయ్యూరు, ఆగస్టు 5: వారపుసంతకు నిత్యావసర సరకులకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు తన ద్విచక్ర వాహనంతో లోయలోకి దూసుకుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. చింతలపూడి గ్రామానికి చెందిన ఉల్లి చిన్నబ్బాయి సోమవారం జరిగే కృష్ణాదేవిపేట వారపు సంతకు బయలుదేరి వెళ్లే క్రమంలో చింతలపూడి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి సమీప కల్వర్టు లోయలోకి దూసుకుపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక నుంచి వస్తున్న ప్రయాణికులు స్పందించి క్షతగాత్రునికి జాతీయ రహదారి యాజమన్యం వాహనంతో కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు.

సారవానిపాలెంలో ప్రత్యేక వైద్య శిబిరం

అనంతగిరి, ఆగస్టు 5: మండలం కాశీపట్నం పంచాయతీ పరిధిలోని సారవానిపాలెం గ్రామంలోని ఓ మలేరియా పాజిటివ్ కేసు నమోదైంది. సోమవారం అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో గ్రామానికి చేరుకుని బాధితులకు వైద్య సేవలు అందించారు. బయట, పరిసరాల్లో మలేరియా స్ప్రెయింగ్ చేయించారు. మలేరియా నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామంలో మీగతా వారిని అప్రమత్తం చేశారు. కార్యక్రమంలోని ఎంపీహెచ్ఈవో నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.